# ఎక్కడో - నిశ్శబ్దంగానే

కాశీభట్ల వేణుగోపాల్



విప్లవమెప్పుడూ విస్ఫోటంతో మొదలుకాదు...

నిశ్శబ్దంగానే...
చల్లగానే...
చీకటి నీడల్లోనే...
ఒక గుండె ఆక్రోశంనించీ...
రెండు కళ్ల తడినించీ...

ఒక బతుకుమంటనించీ... నిశ్శబ్దంగానే...చీలిక బండల సందుల్లోంచి... చినచిన్నగా వూటలాగా స్రవిస్తూ...

ఓ మహాప్రవాహమెప్పుడూ ఓ చిన్నపాయగానే మొదలయ్యేది... విప్లవమెప్పుడూ విస్ఫోటంతో మొదలు కాదు...

** ** **

"సుబ్బారెడ్యాటికి పాయ మామా?"

"గుడికాటికి... పన్చాయతన్జెప్పి పాయ"

"యెవులది పన్చాయతి?"

"గుర్రెడ్డోల్లదంట... గుడ్డేసోపు పెండ్లం... దానికొడుకూ గుంత దిగుమార రెండెకరాలిడ్సకుందున్నరంట... దానికోసరానికి పన్చాయతంట"

"మాదిగోని పొలానిగ్గూడ పంచాయత్లు గావల్సిన దినాలొచ్చినెయ్ దీనెమ్మ... ఒగ రెండెయిలు ఎక్కోవ పార్నూకమన్జెప్పల్యానా గుర్రెడ్డి బావోల్లకు?"

ఊరినించి వచ్చిన లింగారెడ్డికీ... ముసిలెంకట్రెడ్డికీ మధ్య జరుగుతున్న సంభాషణది...

"రెండెయిలేంది లింగార్డీ... నాలుగెయిలు ఎక్కవిచ్చానన్నాడు గుర్రెడ్డి... అస్సలు మేం అమ్మేదిల్యా... మా పోలాలల్ల మేమే సేద్దెం జేసుకుంటలేమా... మాకమ్మనీకె అస్సల అవుసరంల్యా అనా మాదిగ మారెక్క... దాన్కొడుకూ బిర్రున బిగదీసుకున్నారు"

"యేంది వెంకరెడ్డిమామా... బుద్ధి పుట్టెరిగిన కాన్నించీ సూల్ల్యా సూడిది... సింతసెట్టుగ్గట్టి మక్కెలిరగదంతే మాటిండా అనామాదిగ నా కొడుకూ..."

దిలాసాగా కాళ్లు నీలిగించి సిగరెట్ పెట్టతీసి తానోటి వెలిగించుకుని ముసిలెంకట్రెడ్డి కోటిచ్చి అన్నాడు లింగారెడ్డి...

"ఆదినాలు బొయినయ్‌రోయ్ లింగార్డీ! మాలోడా! మాదిగోడా! అనిబిల్చేదానికేల్యా... ఎస్సెస్టాచ్చినెంక (S.C. S.T. Act) ఉచ్చల్బోసుకోన్చస్తాన్నారు మన్నాకొడుకులెల్ల"

ఎద్దుల కొట్టందగ్గర జొన్నచొప్ప నరుకుతున్న పిల్లికండ్లోడికి గుండె రగుల్తోంది వాళ్లామాటల్వింటోంటే...

వాడి చేతిలో చొప్పన్నరుకుతున్న కత్తి వాడి ఒంట్లో వేడికి పదునెక్కుతోంది...

పిల్లి కండ్లోడన్నదే మాదిగ బజారన్న తండ్రీ... రెడ్ల ఫ్యాక్షననబడే యుగాల తగాదాల్లో తలనరకబడి చంపబడ్డ గుడ్డి ఏసోబూ అన్నదమ్ముల బిడ్డలు... ఏసోబు చనిపోయింతర్వాత అతని భార్య మారెమ్మ వున్న రెండెకరాల్లోనే సేద్యం చేసుకుంటూ ఒక్కగానొక్క కొడుకు ఏసుపాదాన్ని ఇంటర్ వరకూ చదివించింది... మట్టింటినే రాయిరాయి పేర్చుకుంటూ తిరిగీ కట్టుకుంది... ఏసుపాదానికెంతకష్టపడ్డా చదువబ్బలేదు... చదువబ్బలేదని ఏసుపాదం దిగులుపడిపోలేదు... ప్రభుత్వమిచ్చే రాయితీల్తో ట్రాక్టర్ కొని... కాంట్రాక్ట్ పనులకి తిప్పుకోడమేకాకుండా... చిన్నాచితకా సబ్ కాంట్రాక్టు కూడా తీసుకున్నాడు... అతను నగరంలోనే కాపురం... మారెమ్మ పల్లెలోనే వుంటుంది... ఇప్పుదున్న స్థితికి రావడానికి మారెమ్మ యెంత యాతనపడిందో... యెంత అసహ్యాన్ని చూసిందో మోసిందో ఆమెకే తెలుసు... పిల్లికండ్లోడనబడే బజారన్నకూ తెలుసు... పల్లెల్లో మతం మార్పిళ్ల వల్ల మిషనరీలేమైనా బాగుపడ్డాయేమోగానీ, మాలా మాదిగల జీవితాల్లోని హైన్యాన్ని మాత్రం తొలగించలేకపోయాయి... క్రిస్టియానిటీలో కలాల ప్రసక్తే లేదుగదా అనేవాళ్లు కరువైయ్యారు... ప్రభుత్వాల అప్లికేషన్లలో కూడా కులం క్లాజు పక్కన రాయడానికి యీ రాజ్యాంగంలో రోజుకో కులం కలుస్తూనే వుంది మొలుస్తూనే వుంది...

దమనరీతుల్లో ఈ రోజుకీ సజీవ శిలాజాల్లా వేల పల్లెలున్న మహా దేశమిది...

నగర యాంత్రిక జీవితంలో... ఎవరు ఎవరో తెలుసుకునే అవసరాలు లేక... ఇరుగుపొరుగు కూడా యాంత్రిక అనామకత్వంలో బతుకులు వెళ్లదీయడం చూసిన ఏసుపాదానికి... నగరంలో అనామకంగా బతకడంలోనే కొద్దిపాటైనా ఆనందముందనిపించేవి... పల్లెలో తనకున్న పాడు గుర్తింపు అతన్ని వేదిస్తుంది...

ఇల్లూ పొలమూ అమ్మేసి వచ్చేయమని తల్లిని అడిగాడు కూడా... కానీ యిప్పుడు నిర్ణయం మార్చుకున్నాడు...

ఇప్పుడున్న ఆ రెండెకరాలూ రెడ్లకు కావాలి... దానికోసం... మిమ్మల్ని ఏడిపించో, హింసించో... లేదూ తీవ్రంగా అవమానించో మిమ్మల్ని ఊరు వదిలేట్లు చేస్తారు... నామాట విను... నువ్వు ఊరొదులుకానీ వాళ్లకా భూమి మాత్రం అమ్మొద్దు అని పిల్లికండ్లోడు చెప్పింతర్వాత... ఆలోచించాడు ఏసుపాదం... మొన్న పల్లెకొచ్చినప్పుడు పిల్లికండ్లోడు చీకట్లో చెరువుగట్టు మీద కూర్చోబెట్టి "వర్యాయేసా! నువ్వు వున్న్యాకాడికి అమ్మి పార్నూకి ఊరిడ్సిపోతవ్... గింతప్పటి కాన్నించీ నిన్ను నా సొంత తమ్మునెక్క జూసుకున్న్యా... నాకోసరానికి నువ్వేమీ చేస్తలేవని గాదుగానీ... నీకోసం గజ్జెప్పాల్రాయేసా! సిన్నెమ్మ నన్ను కడుపున పుట్న్యాకొడుకు లెక్కనే సాకింది... నీకంటే ముందుగాల్నించీ యిసయాలన్నీ నేను తెల్సుకున్న్యా తమ్మా! సిన్నెమ్మ యెన్ని యాస్టలు బడిందో నీకంటె నాకెక్కవ దెల్సు... పీదిని పిడకలేరి నిన్ను సదివిచ్చె... గిసింతకూ... గసింతకూ... మాదిగ ముండా! మాదిగ లంజాంట పిల్చిచ్చుకునే... గీ ముసిల్లంజెకొడ్కు యెంగ్రట్రెడ్డినా బట్ట... యీడ్సక బొయ్యి కల్లాలల్ల సిన్నెమ్మ నెన్నిసార్లు... నాతోసిగాదురా యేసా చెప్పన్యికె... నేనా కతలెల్ల జెప్పలేను... నువ్వు సేను అమ్మగాకు... గాలంజెకొడ్కులు సంపుతమన్నాసరే... సేనమ్మగాకు నీకింకా పెదిన్ని సంగతుల్దెల్చాల" అని పిల్లి కండ్లలోంచీ ఎర్రటి కన్నీళ్లు కార్తుస్తూ బజారన్న చెప్పిన విషయాల్విని పొలం అమ్మకూడదని నిర్ణయం చేసుకున్నాడు ఏసుపాదం.

ఆ రాత్రి చాలాసేపు చర్చించుకున్నారన్నదమ్ములిద్దరూ... చివరికి ఏసు చెప్పిన విషయాన్ని విస్మయంతోనూ... ఆనందంతోనూ కృతజ్ఞతతోనూ అంగీకరించాడు బజారన్న...

** ** **

విప్లవమెప్పుడూ విస్ఫోటంతో మొదలుకాదు...

దానికి తుపాకులూ తూటాలే కావాలని లేదు...

** ** **

"వర్యా బిలికండ్లోడా! సొప్ప నరికినెంక మచ్చలకోల్లు రెండూ గొయ్... మా లింగార్డి సియ్యల్యాకపోతె బువ్వదిండు"



1

ముసిలెంకట్రెడ్డి ఫర్మానా...

వెనక దొడ్లో గింజలేరుకుతింటూన్న కోళ్లు అమాయకంగా కని పించాయి పిల్లికండ్లోడికి... వాటి పీకలు కోసి ఈకలు పీకి గంపకెత్తుకున్నాడు... దిబ్బమీద ఈకలు చల్లేసివస్తూ లింగారెడ్డి మాటలు విన్నాడు...

"అవే మామా! గా ఏసోబు పెండ్లాన్ని పెదిన్నిసార్లు పొకిన్యావ్‌గదా నువ్వు...? దాన్ని పిలంపిచ్చి సెప్పొచ్చుగదా... గుఱ్రెడ్డోలకాసెక్క అయ్యెయ్యే అని... యినకబోతె మొగుడ్సచ్చి ముండమోసింది... వున్న్య అనాకొడ్కుస్గూడ లేప్పార్నూకుతామని"

'కోడిని గొయ్యకూడ రాదినా కొడ్కుకు సంపుతాంటి... సంపమను... సంపితె గింపితె ఇంగ నన్ను సంపాల్సిందె యినా రెడ్డినా...లు' కసిగా అనుకున్నాడు బజారన్న... అతడి పిల్లికండ్లు పులి కళ్లలా మెరుస్తున్నాయి.

పంచాయితీనించీ సుబ్బారెడ్డి వచ్చాడు... వస్తూనే లింగారెడ్డిని చూసి

"ఎప్పుడొచ్చివ్రో లింగార్డీ... యెంసెట్ల మంచిర్యాంకు గొట్టిచ్చివి కొడుక్కి యంత కర్సాయ?" అన్నాడు.

"నెల్లూరోంది ర్యాంకు గ్యారంటీ కోచింగుల్యానా సుబ్బార్డీ... యాభై అంతే... అవే పంచాయతేం జేచ్చిరీ?"

"సోమారానికి మల్ల సిటింగు... తెగేదిల్యా... తెల్లారేదిల్యా... ఛ్ఛ... ల్యాలే లింగార్డీ మనసేతులకెల్లిపాయ... మన కమాండ్ల లేరినా కొడ్కులు... బల్సిన య్... వర్యా.... తర్యా అన్నీ తెగూడల్యా దీనెమ్మ... గవర్మెంటుం....గా" అని బూతు తిట్టు తిట్టి "గుఱ్రెడ్డోల్లు రెండూ మూస్కొని గమ్మునుంటే మేలు సూడ్నాయినా..." అని తండ్రితో అన్నాడు...

వాళ్ల సర్వస్వం యెవరో దోచేసిన భావన వాళ్ల మొహాల్లో

** ** **

**పిల్లి కండ్లలోంచీ ఎర్రటి కన్నీళ్లు కారుస్తూ బజారన్న చెప్పిన విషయాల్విని పొలం అమ్మకూడదని నిర్ణయం చేసుకున్నాడు ఏసుపాదం.**

విప్లవమెప్పుడూ విస్ఫోటించదు... నిశ్శబ్దంగానే... నీడల్లోంచే... ఓ మహాప్రవాహమెప్పుడూ ఓ చిన్నపాయగానే మొదలౌతుంది.

విప్లవం ఎక్కడా విస్ఫోటంతో మొదలుకాదు...

** ** **

సోమవారం... గుడి దగ్గర పంచాయతి...

గుఱ్రెడ్డీ... గుఱ్రెడ్డి మనుషులూ... సుబ్బారెడ్డి... మాజీ కరణం బాపనయ్యా... పనీపాటా లేని యింకొందరూ కూచునున్నారు...

మారెమ్మ రాలేదు...

ఏసుపాదం రాలేదు...

అసహనంగా కోపంగా వున్నారు పెద్దమనుషులు...

చాలాసేపటికి బజారన్న వచ్చాడు...

"ఏంరా... యెంచేపు'సూడాల్రా? మేమాల్లా వచ్చి గంటైపాయ నీ తమ్మున్నీ సిన్నెమ్మనీ తోల్కరాపో" రంకెవేసాడు గుఱ్రెడ్డి...

"వాల్లు రారు రెడ్యా... కర్నూలు కెలిపొయిన్యారు... ఆగుంతకింద రెండెకరాల్సెక్క నాపేర్న రాయిచ్చిన్యారు... గో కాయితాలు" అని తువ్వాల్లో చుట్టిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నకలు తీసిచ్చాడు... వాళ్లు ఊహించనిదిది... ఏసుపాదం కర్నూలులో సెటిలైపొయ్యాడన్న విషయాన్ని ఊతంగా తీసుకుని... వాళ్లూ రొదిలేట్టు చేస్తే... ఆ రెండకరాలూ కలిపేసుకోవచ్చు... అన్నవాళ్ల వ్యూహం బెడిసికొట్టింది...

ఓటమి... అవమానం...

అవే రెడ్యా పెదరెడ్డోల్లగ్గాడ ఈ యేటికే నేను జీతానికుండేటిది... ఇంగా యెన్నాల్లు జీతానికుంటవ్రా బజారో...? పెల్లి జేసుకోవా...? తినాకుడవా ఆబగమంతుడు మాకింతిచ్చిన్యాడు... 'నువ్వీసేను జేసుకుంట సుకంగుండ్రాంట మా సిన్నెమ్మ... తమ్మీ... ఇవి నా పేర్న రాసిచ్చి పాయిరి రెడ్యా"

మరింత అవమానం... జీతగాడు రైతవుతున్నాడు.

అందరి భీకరమైన చూపుల్ని పట్టించుకోకుండా...

పెదవులమీద చిర్నవ్వు... కళ్లలో మెరుపూ... భుజమ్మీదికెక్కిని తువ్వాల్తో అక్కడ్నించీ చిన్నగా కదిలాడు బజారన్న...

** ** **

నిజమే విప్లవమెప్పుడూ చిన్నపాయగానే మొదలౌతుంది.

# మీరు ఫాంటసీల్లో గడుపుతున్నారా?



శృంగార జీవితంలో ఫాంటసీలు ఒక భాగం. ఒక్కొక్కరికి ఒక్కోరకం ఫాంటసీలు ఉంటాయి. ఫాంటసీలు తప్పు కాదు. వాటన్నిటిని తీర్చడం, తీర్చుకోవడం అంతా సులువు కాదు. నిజానికి వాస్తవంలో చేయడం సాధ్యం కాని పనుల్ని ఫాంటసీల్లో చేయడం చాలామంది నైజం. ఇది శృంగారంలో సహజం. పడకమీద చేయాలనుకున్న పనులన్నీ ఎవరయినా చేయగలరా? చేయగలిగితే వాళ్ళకన్నా సౌఖ్యాన్ని అనుభవించే మనుషులు ఈ భూమి మీద మరెవరూ ఉండరు. ఈ ఫాంటసీలు ఎలా ఉంటాయి? ఏవిధంగా ఉంటాయి? ఇవన్నీ ఊహలకే పరిమితమా? నిజం చేసుకోదం అసాధ్యమా? అనే ప్రశ్నలు వస్తాయి.

* ఫాంటసీల్లో ఎన్నో రకాలు. కొందరికి సెక్స్‌ను ట్యూబ్‌లైట్ల వెలుతురులో ఎంజాయ్ చేయాలనుకుంటారు.ఇంకొందరు పట్టపగలు అరుదుగానైనా మనసారా రమించాలనుకుంటారు.

* కొందరు వాత్సాయనుడు సూచించిన విభిన్న భంగిమల్లో శృంగారం జరపాలనుకుంటారు. కాని స్థూలకాయం ఉన్నవాళ్ళకు అది అత్యాశ. అందుకే లావెక్కేవాళ్ళు జాగ్రత్తగా ఉండాలి.

* విశాలమైన బాత్‌రూమ్‌లో తామిద్దరే అభ్యంగన స్నానం చేస్తూ ఏకమవ్వాలనుకుంటారు. మిడిల్‌క్లాస్ కొంపల్లో పొద్దుపుచ్చేవారు ఇందుకు ఫాంటసీల్ని ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదు.

* కొందరు ఎవరూ లేని ఏకాంతాన తామిద్దరే నగ్నంగా రోజంతా సెక్స్‌ను ఎంజాయ్ చేయాలనుకుంటారు. బహుశా పెళ్ళి తర్వాత హనీమూన్‌కు వెళ్ళినవాళ్ళకు తప్ప ఇది సాధ్యం కాదు. పిల్లలు పుట్టాక ఇలాంటి శృంగారం ఓ కల మాత్రమే.

* పెళ్ళయి పిల్లలు పుట్టాక కూడా సెక్స్ సినిమాలన్నా, సెక్స్ పుస్తకాలన్నా, సెక్స్ దృశ్యాలన్నా మరింత మక్కువ పెంచుకునే వారు ఉంటారు. ఇందులో ఆడవాళ్ళు, మగవాళ్ళు ఉంటారు. ఇది ఏ ఒక్కరికో పరిమితమైన అంశం కాదు. ఇలాంటి వారే ఫాంటసీల్ని ఆశ్రయిస్తారు.

* ఫాంటసీల్లో గడిపేవారే దృశ్య,శ్రవణ సాధనాల్లో సెక్స్ కోసం అర్రులు చాస్తారు. ఇలాంటి ఫాంటసీల్ని డబ్బు చేసుకోవడంలో సినిమా వాళ్ళు బాగా సక్సెస్ అయ్యారు.

* వయసు పెరుగుతున్న కొద్దీ శృంగారాన్ని ఎంజాయ్ చేయాలనే కోరిక పెరుగుతుంది. ఒక దశ వరకు ఈ తీవ్రత మనిషిని ఊగించి శాసిస్తుంది. ఆ కాలంలోనే ఫాంటసీల్లో గడుపుతారు.

* సెక్స్‌ను సంపూర్ణంగా ఎంజాయ్ చేయనివారు ఫాంటసీల్ని ఆశ్రయిస్తారు. అసంతృప్తితో బాధపడేవారు కూడా ఫాంటసీల్నే నమ్ముకుంటారు. సెక్స్‌ను ఎంజాయ్ చేసినా కొన్నిరకాల ఫాంటసీలు మాత్రం మిగిలే ఉంటాయి.

* ఫాంటసీలన్ని వాస్తవరూపం దాల్చే వీల్లేదు. కాని ఇద్దరూ తమ ఫాంటసీలు ఎలా ఉంటాయో షేర్ చేసుకోవడం మంచిది. దానివల్ల వాళ్ళ శృంగార జీవితం మరింత రసవంతమవుతుంది.

– ప్రణవ